క్లుప్తంగా

ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ తనిఖీ

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం రూరల్: ఖమ్మం మామిళ్లగూడెంలోని యూపీహెచ్‌సీ, ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అందుతున్న ఆరోగ్య సేవలు, ఫార్మసీ, ల్యాబ్, వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన ఆమె వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. మాతా శిశు సంక్షేమం, అసంక్రమణ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాలని, పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగాలన్నారు. అలాగే, ఎదులాపురంలోని అంగన్‌డీ కేంద్రాలను సందర్శించి గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారంపై సూచనలు చేశారు.

కుట్టుమిషన్ వితరణ

ఖమ్మంగాంధీచౌక్: కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామానికి చెందిన కుక్క నాగేంద్ర కుటుంబానికి లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన రూ.7,500ల విలువ చేసే కుట్టుమిషన్‌ను అందించారు. బుధవారం ఖమ్మంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరామ్, కోశాధికారి గోవిందరావు, డాక్టర్ రాఘవరెడ్డి, మురళీధర్‌రావు, పూర్ణచందర్‌రావు, విశ్వేశ్వరరావు, మల్లిఖార్జున్, దుర్గా ప్రసాద్, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు పట్టివేత

ఖమ్మంమయూరిసెంటర్: అనుమతి లేకుండా నగరంలో చికెన్ వ్యర్థాలను సేకరిస్తున్న వాహనాన్ని కేఎంసీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. 12వ డివిజన్‌లో ఓ చికెన్ సెంటర్ నుంచి వ్యర్థాలను సేకరిస్తుండగా.. కేఎంసీకి ఫిర్యాదు అందడంతో అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాలతో సిబ్బంది వాహనాన్ని సీజ్ చేసి కేఎంసీ కార్యాలయానికి తరలించారు. అనుమతి లేకుండా చికెన్ వ్యర్థాలు సేకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కేఎంసీ అధికారులు వెల్లడించారు.

పశు వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

కామేపల్లి: జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గోపాలమిత్ర పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముచ్చర్ల పశు వైద్యాధికారి డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కెప్టెన్‌బంజరలో గోపాలమిత్ర పశువైద్య శిబిరం నిర్వహించి గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ నరసింహారావు, జాన్, ధర్మ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూసుమంచి: కూసుమంచిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పనిచేస్తున్న ఆడెపు వీరబాబు తన బైక్‌పై కూసుమంచి సెంటర్‌కు వెళ్తుండగా గంగబండతండాకు చెందిన వడిత్య వాచ్యా ఎదురుగా రావడంతో ఇద్దరి వాహనాలు ఢీకొన్నాయి. ఈఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా పోలీసులు చేరుకుని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

సన్మానం..


దయాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న వెలిగేటి చంద్రమోహన్ తదితరులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మంలో కార్తీక వన సమారాధన సందర్భంగా జిల్లా సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన బుధవారం మున్నేరు బ్రిడ్జి పక్కన మామిడి తోటలో నిర్వహించిన వన సమారాధనకు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డితో పాటు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, నంది అవార్డు గ్రహీత రమా మనోహర్‌రావులను జిల్లా సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సాధినేని జనార్దన్‌రావు, సత్యనారాయణరెడ్డి, గోవర్దన్‌రావు, జిల్లా వెంకటేశ్వర్లు, గజేంద్రుల నాగేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తిరుమలాయపాలెం/ఖమ్మం క్రైం: తిరుమలాయపాలెం మండలంలోని పాలేరు, ఆకేరు నుండి అనుమతి లేకుండా ఇసుక ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. హైదర్‌సాయిపేట శివారు ఆకేరు నుంచి వస్తున్న రెండు, కాకరవాయి పాలేరు నుండి వస్తున్న రెండు ట్రాక్టర్లను దమ్మాయిగూడెం వద్ద పట్టుకుని సీజ్ చేశామని అధికారులు తెలిపారు. అలాగే, బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కూచిపూడి జగదీష్ తెలిపారు. అలాగే, ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి సమీపాన ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ రమేష్ వెల్లడించారు.

పాత డ్రెయినేజీలతో పాట్లు..


బస్టాండ్ ప్రాంతంలో చిన్నగా ఉన్న డ్రెయినేజీ


కాలువలో వేసిన వ్యర్థాలు

చిన్న డ్రెయినేజీలతో అవస్థలు
- రోడ్లు, ఇళ్లల్లోకి చేరుతున్న మురుగు
- కాలువలో వ్యర్థాలు పడేస్తుండడంతో సమస్య అధికం
- వర్షాకాలంలో పరిస్థితి మరీ అధ్వానం
- పట్టించుకోని మున్సిపల్ శాఖ

ఖమ్మం రావర్తినగర్: ఎప్పుడో నిర్మించిన డ్రెయినేజీలు ఇప్పుడు ఇబ్బందులు పెడుతున్నాయి. నగరంలోని బుర్హాన్‌పురం, మామిళ్లగూడెం ప్రాంతాల్లో గత పదేళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు, బైపాస్ రోడ్డులో బస్టాండ్ పడడంతో జనాభా సంఖ్య పెరిగి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా మున్సిపాల్ శాఖ పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాల్ శాఖ అప్పట్లో ఎలాంటి కట్టడాలు లేక పోవడంతో ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీలను చిన్నగా కట్టారు. అయితే గత పదేళ్లలో ఇళ్లు, పాఠశాలలు పెరగడం, బస్టాండ్ రావడంతో బుర్హాన్‌పురం, మామిళ్లగూడెంలోని సమస్య ఎక్కువైంది. ఈ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా ఇళ్లు మునిగిన సంగతి విదితమే. అయితే బుర్హాన్‌పురం నుంచి వస్తున్న మురుగు డీఆర్‌డీఏ కార్యాలయం మీదుగా కూరగాయల మార్కెట్ పక్క నుంచి కాల్వకట్టబజార్, వెంకటేశ్వరనగర్, మామిళ్లగూడెం, రైల్వే ట్రాక్ కింద నుంచి సారథినగర్ వైపుగా మున్నేరులో కలుస్తుండగా.. కాగా, ట్రాక్ పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీలను ఆక్రమించినట్లు తెలుస్తోంది.

డ్రెయినేజీలపై అక్రమ కట్టడాలు..

నగరంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న డ్రెయినేజీలను కూల్చి నూతన డ్రెయినేజీలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయాలు ఆ ప్రాంత వాసుల నుంచి వినిపిస్తుంది. కాగా, మామిళ్లగూడెంలో కొంతమంది డ్రెయినేజీల ఆక్రమించి వాటి మీదనే ఇళ్లు నిర్మించారనే ఆరోపణలున్నాయి. వీటిని తొలగించి నూతన డ్రెయినేజీలను నిర్మించాలని ఆదిశగా మున్సిపల్ శాఖ నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యర్థాలతో పరేషాన్..

నగరంలోని డ్రెయినేజీల్లో అధికంగా చెత్త వేయడంతో కాలువలు కొద్దిపాటి వర్షానికే నిండి ఆమురుగంతా ఇళ్లలోకి చేరుతోంది. డ్రెయినేజీల్లో చెత్తను వేయకుండా నిలువరించినట్లయితే కాలువలు నిండే పరిస్థితి ఉండదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో సమస్య తీవ్రతరం అవుతుందని, వ్యర్థాలు పోయకుండా నియంత్రించే దిశగా మున్సిపాల్ శాఖ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'గ్రానైట్' సమస్యలు పరిష్కరించాలి


మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం పలువురు మంత్రులకు విన్నవించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, సబ్సిడీలు తక్షణమే విడుదల చేయాలని, క్వారీల అనుమతులను సులభతరం చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబుతో పాటు ఎంపీ ఎంపీ రఘురాంరెడ్డి తదితరులను రాష్ట్ర విత్తన గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి వినతి పత్రాలు అందించినట్లు తెలిపారు.

సీసీఐ నిబంధనలు సడలించాలి

తిరుమలాయపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగం పట్ల అవలంబిస్తున్న విధానాలతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య విమర్శించారు. బుధవారం మండలంలోని గోల్‌తండా జిన్నింగ్ మిల్లును రైతు సంఘం నాయకులు పరిశీలించారు. సీసీఐ నిబంధనలతో పత్తి పంట అమ్ముకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారని, అయినా ఏ మంత్రి స్పందించడం లేదని విమర్శించారు. నిబంధన లేకుండా పత్తిని కొనాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ఏఐపీకేఎస్ రాష్ట్ర నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు ఆర్.శివలింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావుతోపాటు మారుతి మల్లయ్య, బానోత్ శంకర్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, వెంకటఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


నగదు అందిస్తున్న చంద్రశేఖర్

ఖమ్మంవన్‌టౌన్: రామన్నపేట గ్రామంలోని మారుతీనగర్‌లో స్వయంభు శ్రీ విజయ గణపతి మందిర నిర్మాణానికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ విరాళంగా రూ.50వేలు అందించి తన భక్తిభావాన్ని చాటుకున్నారు. బుధవారం మందిర శంకుస్థాపన మహోత్సవం సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలన్నారు. భవిష్యత్తులోనూ తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నిరంజన్, నరేష్, సుధీర్ శ్రీనివాసరావు, వాస్తు సిద్ధాంతి నాగేశ్వరరావు తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై బుధవారం గుర్తుతెలియని వ్యక్తి(35) మృతదేహాన్ని జీఆర్‌పీ సిబ్బంది గుర్తించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తన బృందంతో చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు సూచించారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

ఖమ్మంరూరల్: అమరుల ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నండ్ర ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్తగూడెంలో జరిగిన చిన్నమెలకయ్య 39వ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు, వర్గపోరాటాలు నిర్వహించడంలో ఆయన పాత్ర మరువలేనదని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పాలకులు తక్షణమే అమలు చేయాలని, హామీలను విస్మరిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు వి.సుదర్శన్ రెడ్డి, ఏటుకూరి ప్రసాద్, వి.నాగేశ్వరరావు, ఎస్.కృష్ణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం సందర్శన

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంను రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం పరిశీలించారు. ఏ జిల్లాలో ఎలాంటి క్రీడా వసతులు ఉనాయనే అంశాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం స్టేడియంలో వసతులను పరిశీలించి కోచ్‌లు, క్రీడాకారుల అభిప్రాయాలు సేకరించడమే కాక ఇక్కడ శిక్షణ పొందిన వారు హాజరైన పోటీల వివరాలు ఆరా తీశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్, సాగర్‌పటేల్, ప్రమోద్ యాదవ్, శాట్స్ అధికారి రవికుమార్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరక్ష'లో ఫైబ్రో స్కాన్ క్యాంప్

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని శ్రీరక్ష ఆస్పత్రిలో బుధవారం ఉచిత ఫైబ్రో స్కాన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జైడస్ లైఫ్‌సైన్స్ సహకారంతో ఫైబ్రో స్కాన్ ద్వారా దాదాపు 500 వందల మందికి కాలేయ సంబంధిత సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు గోంగూర వెంకటేశ్వర్లు, గార్లపాటి వెంకటేశ్, ఏడుకొండలు, కాశీ విశ్వనాథ్, కన్నేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో రిజర్వేషన్లు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో నిబంధనల మేరకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ కంపెనీ అధ్యక్షుడు ఆనంద్ తెలిపారు. బుధవారం ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో కుక్కల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థలో ఉద్యోగుల సంఖ్య పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని, బదిలీల్లో సంఘం ఉద్యోగులకు అండగా నిలిచిందన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి రామకృష్ణ సంఘం ప్రగతి నివేదికను వినిపించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కిరణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం విద్యార్థి ప్రతిభ



గోల్డ్ మెడల్‌తో జక్కుల ప్రహర్షన్‌పాల్

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన జక్కుల రాజేష్ కుమారుడు జక్కుల ప్రహర్షన్‌పాల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటి డిసెంబర్ 1 నుంచి పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జరిగే హుషు కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. కాగా ప్రహర్షన్‌పాల్ ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో 4వ తరగతి చదువుతుండగా.. ఇటీవల రంగారెడ్డి జిల్లా హస్తినాపూర్‌లో జరిగిన అండర్-12, 24 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థులు..

ఖమ్మం సహకారనగర్: ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరిగిన భద్రశైల జాతీయస్థాయి నృత్య పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఫ్యూచర్ కిడ్స్ కరస్పాండెంట్ చింతిరాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించాక ఆయన మాట్లాడారు. జ్ఞాన సహస్ర, సింగం రిత్వికలు జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్నేహప్రియ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల విజయవాడలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చారని మౌంట్‌ఫోర్ట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రెవరెండ్ బ్రదర్ జాన్‌పాల్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జోషిలు తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళాన్ని జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఒయాసిస్ రిసార్ట్‌లో ఈ నెల 15న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉద్యోగుల ఆధ్వర్యాన జరిగే మాలల ఆత్మీయ సమ్మేళాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకుడు కొట్టె సుధాకర్ కోరారు. బుధవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో గుమ్మడి కనకరాజు, కొరవి దయానంద్, దామల సత్యనారాయణ, పేరం మల్లయ్య, కె.భాస్కర్, పాగియోనా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ప్రకాశ్‌నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ గాంధీచౌక్ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏఈ క్రాంతిసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రకాశ్‌నగర్, పరుచూరి వారి వీధి, ఎఫ్‌సీఐ రోడ్, ఆటోస్టాండ్, బీజాలవారి తోట, పత్తి మార్కెట్, మిర్చి మార్కెట్, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

స్పష్టమైన సమాచారం సేకరించండి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: సర్వేకి వెళ్లిన సిబ్బంది, ఎన్యుమరేటర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ వారి నుంచి స్పష్టమైన సమాచారం సేకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కేఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. బుధవారం కేఎంసీ కార్యాలయంలో సర్వే పర్యవేక్షణ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులకు కేటాయించిన ఈబీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సర్వే జరుగుతున్న తీరును గమనించాలన్నారు. అలాగే సేకరించిన వివరాల నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకుంటూ సమాచారం బయటకు పోకుండా ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. బయట ప్రాంతాలతో పోలిస్తే ఖమ్మం వెనుకబడి ఉందని, సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఏఓ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక కబ్జాపై ఫిర్యాదు

నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లి, లక్ష్మీనగర్, రోటరీనగర్, డబుల్ బెడ్రూం ప్రాంతాల నివాసులకు సంబంధించిన శ్మశానవాటికను కొంతమంది కబ్జా చేస్తున్నారని స్థానికులు బుధవారం అదనపు కలెక్టర్ శ్రీజకు ఫిర్యాదు చేశారు. కొందరు శ్మశాన వాటికకు ఉన్న ఫెన్సింగ్ తొలగించి కబ్జా చేయాలని చూస్తున్నారని, స్థలాన్ని రక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటింటి సర్వే పరిశీలన

కూసుమంచి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రాంచందర్‌రావు బుధవారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించి సర్వే తీరును పరిశీలించి సిబ్బంది, ప్రజలతో మాట్లాడారు. మండలంలో మొత్తం 20,836 ఇళ్లకు గానూ బుధవారం 6,231 ఇళ్లను సర్వే చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు


పాలేరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కూసుమంచి/నేలకొండపల్లి: రైతులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కూసుమంచి మండలం పాలేరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. అందరూ ప్రభుత్వ కేంద్రాలకే వస్తున్నారా, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కాంటా వేసి మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే, నేలకొండపల్లి తహసీల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ రికార్డులు పరిశీలించాక ఉద్యోగులకు సూచనలు చేశారు. పలువురు రైతులు రహదారుల వెంట ధాన్యం ఆరబెట్టడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన రహదారికి ఓ పక్క ధాన్యం ఆరబోసిన ప్రాంతాల్లో సరైన జాగ్రత్తలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, మేనేజర్ శ్రీలత, నేలకొండపల్లి తహసీల్దార్ జె.మాణిక్‌రావ్, డీటీ ఇమ్రాన్, ఎంఆర్ఐలు ఆలస్యం మధుసూదన్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల సందర్శన


ఖమ్మంక్రైం: పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంరూరల్/ఖమ్మంక్రైం: ఖమ్మంరూరల్ మండలంలోని పాన్నేకల్‌లో గల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయని, కాంటాలు సరిగా వేస్తున్నారా, ఏమైనా ఇబ్బందులున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తినా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ఖమ్మం పత్తి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏసీపీ రమణమూర్తి సందర్శించారు. పత్తి కొనుగోళ్లపై రైతులతో మాట్లాడి సమస్యలు ఉండే స్థానిక పోలీసులకు తెలపాలన్నారు. ఆయన వెంట సీఐ రమేష్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రఘునాథపాలెం: మండలంలోని కేవీ బంజర్‌లో మంచుకొండ సహకార సంఘం ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆ కేంద్రాన్ని మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, ఏఈఓ వేదవ్యాస్ బుధవారం సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు సూచించారు. ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేసి బోనస్ పొందాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే పర్యటన


ఖమ్మంరూరల్: చెక్కు అందిస్తున్న ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి బుధవారం నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు కాసాని నాగేశ్వరరావును పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, నాయకులు పి.రాంబాబు, కొండా కనకప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లికి చెందిన కొండం వీరబాబు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కాగా మృతుడికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ తరఫున మంజూరైన రూ.2లక్షల చెక్కును పాలేరు మాజీ ఎమ్మెల్యేకందాల ఉపేందర్‌రెడ్డి బుధవారం ఆయన కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కందాల మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ ఇన్సూరెన్స్ కింద ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, మాజీ జెడ్పీటీసీ ఎండపల్లి వరప్రసాద్, అక్కినపల్లి వెంకన్న, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

ఆడంబరాలు వద్దు

ఖమ్మంవన్‌టౌన్: ఈ నెల 15న తన పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలు చేయొద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో జిల్లా సమగ్రాభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేశానని భవిష్యత్‌లోనూ ఇలాగే పని చేస్తానని తెలిపారు.

రేపు టేకులతండాలో గ్రామసభ


గ్రామసభ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కామేపల్లి: మండలంలోని టేకులతండాలో 15న ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేయనున్నట్లు డీపీఓ ఆశాలత, ఖమ్మం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తి ఆబ జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఈ సభలో పెసా, అటవీ హక్కుల చట్టం, గిరిజన హక్కులు, సాధికారిత, అభివృద్ధి, జీపీ అభివృద్ధి ప్రణాళిక వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీఓ జహీరుద్దీన్, ఎంపీడీఓ రవీందర్, జీపీ ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజా, కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వద్దు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపీడీఓ ఎం.యర్రయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని బోదులబండ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీ నిర్వాహకులు పరిశుభ్రత ప్రదేశంలో వంటలు చేయాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశాక ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.